సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 18 ఏప్రిల్ । 2025



నిధుల్లేక.. పనులు సాగక

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.

- IIలో ▸



సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

విశ్రాంత ఉద్యోగులు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0 /23.2

ఉదయం నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అక్రమ వడ్డీ వ్యాపారులపై దాడులు



ఖలీల్‌వాడి : నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో అక్రమ వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు సోదాలు చేశారు. ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా ఫైనాన్స్‌లు ఏర్పాటు చేసుకొని వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమ వడ్డీ దందా నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు దాడులు చేపట్టారు. సోదాల్లో భాగంగా నిజామాబాద్ డివిజన్‌లో 27 ఫైనాన్స్ నోట్స్, 543 ప్రామిసరీ నోట్స్, ఒక వాహనం, రూ.53.09లక్షల నగదు, ఆర్మూర్ డివిజన్‌లో 4 ఫైనాన్స్ నోట్స్, 610 ప్రామిసరీ నోట్స్, 21 సేల్ డీడ్స్, 5 బాండు పేపర్లు, రూ.2.76లక్షల నగదు, బోధన్ డివిజన్‌లో 282 ప్రామిసరీ నోట్స్, 22 సేల్ డీడ్స్, రెండు వాహనాలు, 25 బాండ్ పేపర్లు, రూ.12.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో జడ్జిల బదిలీలు

ఖలీల్ వాడి : జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ ఆర్మూర్ జడ్జి నసీమా సుల్తానా నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థకు బదిలీ కాగా, బోధన్ సీనియర్ సివిల్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ హైదరాబాద్‌లోని 15 అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఎల్‌బీ నగర్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి శ్రీదేవి సీనియర్ సివిల్ జడ్జిగా ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. నిజామాబాద్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి పద్మావతి సికింద్రాబాద్‌లోని 11వ మెట్రోపాలిటన్‌కు బదిలీ కాగా, నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు హైదరాబాద్ లోని ఒకటవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గా బదిలీ అయ్యారు. 17వ సివిల్ కోర్టు అడిషనల్ జడ్జి కాంచన రెడ్డి బోధన్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా బదిలీ అయ్యారు.

పశువుల సంరక్షణకే వ్యాధి నివారణ టీకాలు

- జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రోహిత్‌రెడ్డి



ఆర్మూర్ : పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి సోకకుండా సంరక్షించేందుకే వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. టీకాలు వేసే కార్యక్రమాన్ని రోహిత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి, పశువైద్యం అందుతున్న విధివిధానాలపై పాడిరైతులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల 15 వరకు పశువులకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్, రాధ, దివ్య, శ్రీనివాస్, అంకాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభ పోస్టర్ ఆవిష్కరణ



నిజామాబాద్ అర్బన్ : స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు పొందిన తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులంతా ప్రభుత్వానికి కృతజ్ఞత చాటుకోవడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. ఈ నెల 20న న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ కృతజ్ఞత సభ పోస్టర్‌ను తన కార్యాలయంలో డీఈవో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమోషన్లు పొందిన వారంతా బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లా విద్యాశాఖను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ జమీలుల్లా, కేవీ రమణాచారి, రాష్ట్ర సహాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, సంఘ బాధ్యులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి కాలువ లీకేజీ నీటి కోసం అడ్డుకట్ట వేస్తున్న రైతులు



చివరికి తడి కష్టాలు!

- నీరందక ఎండిపోతున్న పంటలు
- ఒక్క తడికి నీరివ్వాలని లక్ష్మికాలువ ఆయకట్టు రైతుల మొర

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లక్ష్మి కాలువ ఆయకట్టులో చేతికొచ్చిన వరి పంట నీరు లేక ఎండిపోతోంది. చివరి తడిని అందించి పంటను గట్టెక్కించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. లక్ష్మికాలువలోని లీకేజీ నీటితో పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

బాల్కొండ : లక్ష్మి కాలువ ద్వారా విడుదలవుతున్న నీటిని ఈ నెల 9న అధికారులు నిలిపివేశారు. అయితే మెండోరా మండలం బుస్సాపూర్, నల్లూర్, ముప్కాల్ మండలం కొత్తపల్లి, నల్లూర్ గ్రామాల్లో వరి పంటలు ఇంకా కోతకు రాలేదు. ఒక్క తడి నీరందితే చాలు పంటలు గట్టెక్కుతాయి. ఇదే విషయాన్ని అధికారులకు చెబితే ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుతం చుక్క నీరు వదిలే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు లీకేజీ నీటికి అడుగడుగునా అడ్డుకట్ట వేసి తూముల వైపు మళ్లించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

ప్రాజెక్ట్ నుంచి కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని వదిలినా పంటలు గట్టెక్కే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి లక్ష్మికాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఆయకట్టు పరిధిలో సాగవుతున్న వరి

గతేడాది కంటే ఎక్కువే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో గతేడాది కంటే ఎక్కు వ నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్ట్‌లో 8.9 టీఎంసీల నీరు నిల్వ ఉంటే ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరుంది. అయినా ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు పంటలను కాపాడేందుకు అధికారులు నీటి విడుదలను చేపట్టడం లేదని రైతు లు ఆరోపిస్తున్నారు. లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల కోసం హెడ్ రెగ్యులేటర్ ఎత్తిపోగా, లక్ష్మి లిఫ్టును వినియోగించి నీటి విడుదల చేపట్టొచ్చు. కానీ, ప్రాజెక్ట్ అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదని తెలుస్తోంది. చివరి తడికి నీరు అందించకుంటే సుమారు వెయ్యి ఎకరాల మేర పంట ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిని విడుదల చేయాలి



నీరందక వరి పంట ఎండిపోతుంది. ఒక్క తడి అందిస్తే పంటలు గట్టెక్కుతాయి. ఏటా ఇదే తిప్పలు అవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నీటిని విడుదల చేయాలి.

– గంగారాం, రైతు, బుస్సాపూర్

పాలకులు పట్టించుకోవాలి



100 క్యూసెక్కుల నీరు మూడ్రోజులు వదిలినా మా పంటలకు నీరు అందుతుంది. ప్రాజెక్ట్‌లో కూడా నిరుడు కంటే ఎక్కువగానే నీరుంది. పాలకులు పట్టించుకొని పంటలను కాపాడాలి.

– గౌతం, రైతు, బుస్సాపూర్

జోరు పెంచిన బీఆర్‌ఎస్



ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీతలు

- హామీల అమలు ఎక్కడ? : ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి
- గత ప్రభుత్వంలో అప్పులయ్యాయి : మంత్రి జూపల్లి
- భీమ్‌గల్‌లో ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- ప్రజాసమస్యలపై పోరాటానికి తగ్గేదే లేదంటున్న గులాబీ శ్రేణులు
- రైతు ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ సభకు లభించిన స్పందన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు ఎక్కడంటూ గులాబీ పార్టీ నిలదీతలను జిల్లాలో ఉధృతం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసి 16 నెలలు గడిచినప్పటికీ హామీలను అమలు చేసే విషయంలో ఏమీ పట్టనట్లు ఉంటున్నారంటూ బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తోంది. జిల్లాలో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజాసమస్యల విషయమై కార్యాచరణను ముమ్మరం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీసే విషయంలో ఏమాత్రం తగ్గేదే లేదంటూ స్పీడ్ పెంచారు. రైతుల ఆత్మహత్యలపై గత జనవరిలో బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ వచ్చిన నేపథ్యంలో మెండోరా మండలం బుస్సాపూర్‌లో నిర్వహించిన సభకు రైతుల నుంచి భారీ స్పందన వచ్చింది. రైతులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. గోదావరి, కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయే కుట్ర జరుగుతుంటే రేవంత్ సర్కార్ సోయిలేకుండా వ్యవహరిస్తోందని ఆ సభలో బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. ప్రజా సమస్యలపై పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయిలో పోరుబాట పట్టిన నేపథ్యంలో గులాబీ శ్రేణులు యాక్టివ్ అవుతున్నాయి. నాయకత్వం పిలుపు మేరకు జిల్లాలో వరుసగా రైతు రుణమాఫీ, ఎల్‌ఆర్‌ఎస్, ధాన్యం బోనస్, రైతుబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. దీక్షాదివస్‌నూ నిర్వహించి కార్యకర్తలను ముందుకు నడిపించారు.

కాంగ్రెస్ హామీలపై రగడ..

బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్‌లో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో హామీల విషయమై రగడ నెలకొంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ హామీలను ప్రస్తావించారు. తులం బంగారం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, కౌలు రైతులకు రూ.15 వేలు, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు, పోడు పట్టాలు, అమరుల తల్లిదండ్రులకు రూ.25 వేల పింఛన్, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ తదితర హామీలను ఎందుకు అమలు చేయడంలేదంటూ ప్రశాంత్ రెడ్డి నిలదీశారు. ఆడబిడ్డలు హామీల గురించి అడుగుతున్నారని ముఖ్యమంత్రికి చెప్పాలని వేముల అన్నారు. దీంతో మంత్రి జూపల్లి స్పందిస్తూ గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని, వడ్డీలు కట్టడానికే సరిపోతోందని కౌంటర్ ఇచ్చారు. అప్పులు రహస్యంగా చేయరని, బడ్జెట్‌లో ప్రకటించే చేస్తారని, అప్పుల పేరు చెప్పి హామీల అమలును గాలికొదిలేయడం సరికాదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

కార్యకర్తల్లో ఊపు..

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం భీమ్‌గల్ సభలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. తులం బంగారం ఇవ్వాలంటూ ప్లకార్డులు పట్టుకున్నారు. దీంతో పోలీసులు అనూహ్యంగా లాఠీచార్జి చేశారు. దీంతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కార్యకర్తలకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఏమాత్రం తగ్గేదే లేదంటూ, ఇకపై ప్రజల పక్షాన పోరు మరింత ఉధృతం చేస్తామంటూ ప్రశాంత్‌రెడ్డి ప్రకటించడంతో కార్యకర్తల్లో మరింత ఊపు వచ్చింది.

న్యాయవాదుల సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- వీడ్కోలు సమావేశంలో జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి : కోర్టులో న్యాయవాదుల సహకారం మరువలేనిదని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జడ్జి మాట్లాడారు. మూడున్నరేళ్ల పదవీకాలంలో న్యాయాన్ని కక్షిదారులకు అందించడంలో న్యాయవాదుల సహకారం వెలకట్టలేనిదన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తుల లక్ష్యం కక్షిదారులకు న్యాయసేవలు త్వరితగతిన అందించడమేనని అన్నారు. వేలాది మంది మహిళలు, బాలికలకు ఆత్మరక్షణ కోసం ఇప్పించిన తైక్వాండో శిక్షణ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకోవడం నిజామాబాద్ మహిళా లోకపు చైతన్యశీలికి దక్కిన అరుదైన గౌరవంగా ఆమె అభివర్ణించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిల్ల సాయిరెడ్డి మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ సమన్వయంతో మెరుగైన న్యాయ ఫలితాలు కక్షిదారులకు అందించడంలో ముందుభాగాన నిలిచామన్నారు. అనంతరం జిల్లా జడ్జి సునీతను ఘనంగా సన్మానించారు. బార్ ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, బార్ ఉపాధ్యక్షులు దిలీప్, సురేష్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీ రాణి, కోశాధికారి నారాయణ దాసు, లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, న్యాయవాదులు రమాదేవి, ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్, రమేశ్, కృపాకర్ రెడ్డి, జగదీశ్వర్ రావు, కిరణ్‌కుమార్ గౌడ్, మాజీ పీపీ మధుసూదన్ రావు, టక్కర్ హన్మంత్ రెడ్డి, అజార్ కిషన్ రావు, వీ భాస్కర్, పరుచూరి శ్రీధర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు రూ.3.50 కోట్లు

- మెడికల్ కాలేజ్, ఎంసీహెచ్‌లలో అభివృద్ధి పనులకు నిధులు
- వైద్యవిభాగాలను తనిఖీ చేసిన డీఎంఈ
- నాలుగు గంటలపాటు సుదీర్ఘ పరిశీలన
- మాతాశిశు సంరక్షణ క్రిటికల్ కేర్‌లో రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తాం
- డీఎంఈ నరేంద్రకుమార్ వెల్లడి

నిజామాబాద్ నాగారం : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఎంసీహెచ్, మెడికల్ కాలేజీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.3.50 కోట్లు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్రకుమార్ వెల్లడించారు. మాతా శిశు సంరక్షణ క్రిటికల్ కేర్ విభాగంలో నాలుగు లిఫ్టులు ఏర్పాటు చేయడంతోపాటు జీజీహెచ్‌ను అధునాతనంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్, ఎంసీహెచ్, మెడికల్, నర్సింగ్ కాలేజీలను గురువారం రాష్ట్ర ఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్‌తో కలిసి డీఎంఈ పరిశీలించారు. సుమారు నాలుగు గంటలపాటు ఆస్పత్రిలో పర్యటించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చేపట్టాల్సిన మరమ్మతు పనులపై క్షేత్ర పర్యటనలో ఉన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో గూగుల్ మీట్ ద్వారా సంప్రదించి చర్చించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో జీజీహెచ్ పనితీరు ప్రస్తావనకు వచ్చిందన్నారు. ఈ మేరకు జీజీహెచ్‌ను సందర్శించినట్లు తెలిపారు. విడుదలైన నిధుల నుంచి రూ.కోటి 50 లక్షలతో జీజీహెచ్‌లో డ్రెయినేజీ వ్యవస్థ, ఆవరణలో పరిశుభ్రత, భవనానికి గ్లాసులు తదితర మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.30 లక్షలతో నర్సింగ్ కాలేజ్ భవనానికి మరమ్మతులు చేసి పీజీ విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. వారి వెంట వైస్ ప్రిన్సిపాల్స్ జలగం తిరుపతిరావు, నాగమోహన్, ఎంఎస్ఐడీసీ ఈఈ కుమార్, సూపరింటెండెంట్ నాగరాజు, ప్రొఫెసర్లు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ మెడికల్ కళాశాలను తనిఖీ చేస్తున్న డీఎంఈ నరేంద్రకుమార్, ఇతర అధికారులు

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- 'భూ భారతి' చట్టంతో రైతుల భూములకు భరోసా
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- మూడు మండలాల్లో అవగాహన సదస్సులు

కమ్మర్‌పల్లి/మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి' నూతన ఆర్‌వోఆర్ (రికార్డ్ ఆఫ్ రెవెన్యూ) చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండల కేంద్రాల్లో భూ భారతి చట్టంపై గురువారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు క్షుణ్ణంగా వివరించారు. వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు. రైతుల భూములకు భరోసా లభిస్తుందన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు, సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చనున్నట్లు తెలిపారు. మే మొదటి వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని వెల్లడించారు. అందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూ భారతి చట్టంపై సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారని, నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. భూ వివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని చెప్పారు. ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాదిలోపు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు.



కమ్మర్‌పల్లిలో భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన రైతులు



మోర్తాడ్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమస్యల పరిష్కారానికి మూడంచెల వ్యవస్థ..

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి ద్వారా మూడంచెల వ్యవస్థ ప్రవేశపెట్టిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారన్నారు. వ్యవసాయ భూములతోపాటు, వ్యవసాయేతర, మిగతా అన్ని రకాల భూముల వివరాలు రెవెన్యూ కార్యాలయంలో నమోదై ఉన్నాయన్నారు. ఇది వరకు ఉన్న ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ప్రస్తుతం రికార్డుల నిర్వహణ ఉంటుందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్‌లో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను నవీకరణ చేస్తారని తెలిపారు. సదస్సుల్లో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు ఆంజనేయులు, కృష్ణ, ఎంపీడీవో తిరుమల, ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్లు బూత్‌పురం మహిపాల్, లింగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, వ్యవసాయాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో భూసమస్యను వివరిస్తున్న రైతు మహ్మద్ సొహైల్

మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దు

భూ సమస్యలు, లోటుపాట్ల సవరణ వంటి వాటి కోసం రైతులు మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించవద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఎవరికీ ఎలాంటి డబ్బులు ఇవ్వొద్దన్నారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని పేర్కొన్నారు. అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. నూతన చట్టంలో ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై సలహాలు సూచనలు చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

22న తెయూ వార్షిక దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వార్షిక దినోత్సవాన్ని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్‌ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గురుకుల పరీక్షకు బందోబస్తు

ఖలీల్‌వాడి: జిల్లాలో ఈనెల 20న జరిగే మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల బ్యాక్‌లాగ్‌ సీట్ల భర్తీకి జరిగే పరీక్షలకు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉన్న షాపులను మూసిఉంచాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో గతంలో వివిధ కారణాలతో మూతబడిన మూడు బార్లకు కొత్త దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్‌ సీఐ దిలీప్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఫారం-1లో అభ్యర్థన పత్రం, మూడు కలర్‌ ఫోటోలు, తిరిగి చెల్లించబడని లక్ష రూపాయల డీడీ లేదా చలాన్‌ (నాన్‌ రిఫండబుల్‌), ఆధార్‌ లేదా పాన్‌కార్డ్‌ జిరాక్స్‌లను ఈనెల 26లోపు జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈనెల 29న ఉదయం కలెక్టర్‌ సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు. బార్లను మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఐదు కిలోమీటర్లలోపు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మోపాల్‌, మాణిక్‌ బండార్‌, నాగారంలో ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడిగా కోటపాటి



ఆర్మూర్‌: పట్టణానికి చెందిన ఉద్యమ నాయకుడు కోటపాటి నర్సింహం నాయుడును ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ, సలహా కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఆయనను సలహా కమిటీలోకి తీసుకున్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో వీసీ అల్దాస్‌ జానయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ హోదా రెండేళ్ల కాలం కొనసాగుతుందని వివరించారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

నిజామాబాద్‌ సిటీ: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇకపై కాంగ్రెస్‌ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు, చౌకబారు విమర్శలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి హితవుపలికారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు భీంగల్‌ పర్యటన సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీలో ప్రశాంత్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. ప్రశాంత్‌రెడ్డి ఇకనైనా తన పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే ఆయనకు కాంగ్రెస్‌ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నిధుల్లేక.. పనులు సాగలేక..

- జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఇబ్బందులు
- తల్లి చేపల కోసం ఫైసలు కరువు



తల్లి చేపలను వదిలేందుకు సిద్ధం చేసిన కుంట



చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఏర్పాటు చేసిన సిమెంట్‌ కుండీలు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ప్రస్తుతం చేపపిల్లల ఉత్పత్తి కోసం పనులను ప్రారంభించారు. కానీ నిధులు లేక పనులు ముందుకుసాగడం లేదు. ప్రాజెక్ట్‌ దిగువన 42 ఎకరాల విస్తీర్ణంతో 250 సిమెంట్‌ కుండీలతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఉంది. కానీ పని చేసే సిబ్బంది మాత్రం ఏడుగురు మాత్రమే ఉన్నారు. చేప పిల్లల కేంద్రంలో ప్రతి సంవత్సరం చేప పిల్లల ఉత్పత్తి చేయుటకు రూ.8లక్షల నిధులు అవసరమవుతాయి. కానీ ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ కూడ రావడం లేదు. గతేడాది కేవలం చివరి నిమిషంలో లక్ష రూపాయాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చేప పిల్లల ఉత్పత్తి మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

2 టన్నుల తల్లి చేపలు అవసరం..

ప్రస్తుతం చేపపిల్లల ఉత్పత్తి కోసం అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కోసం ముందుగా చెరువుల నుంచి తల్లి చేపలను దిగుమతి చేసుకుంటారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి 2టన్నుల తల్లి చేపలు అవసరం ఉంటుంది. కిలోకు 100 రూపాయాల చొప్పున మత్స్యకారుల నుంచి కొనుగోలు చేయాలి. అ లెక్కన రెండు టన్నులకు 2లక్షల రూపాయాలు, రవాణా ఖర్చులు 50వేలు అవుతుంది. కానీ ప్రభుత్వం ఇప్పటికీ చిల్లి గవ్వ కూడ ఇవ్వ లేదు. దీంతో తల్లి చేపలను ఎలా కొనుగోలు చేయాలని మత్స్యశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేప పిల్లల కేంద్రానికి దగ్గరలో ఉన్న చెరువుల్లో ప్రస్తుతం నీరు నిండుగా ఉంది. తల్లిచేపలను వలలతో వేటాడితే ఎక్కువ నీరున్నా చెరువుల్లో చిక్కవు. దీంతో బోధన్‌, నవీపేట్‌ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. మే 2వ వారం నుంచి తల్లి చేపలను తీసుకురావాల్సి ఉంటుంది. గతంలో పని చేసిన ఎఫ్‌డీవోలు జేబులోనుంచి ఖర్చు చేసి ఇప్పటికీ డబ్బులు రాకా నానా అవస్థలు పడుతున్నారు. అందుకే చేప పిల్లల కేంద్రంలో పని చేయాలంటే అధికారులు జంకుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని మత్స్యకారులు డిమాండ్‌ చేస్తున్నారు.

నిధులు రావడం లేదు..

పోచంపాడ్‌లోని జాతీయ చేపపిల్లల కేంద్రానికి నిధులు రావడం లేదు. ప్రభుత్వానికి పలుమార్లు నివేదించాం. ఇక్కడ పని చేసే అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులు కూడ జేబులో నుంచి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

–ఆంజనేయ స్వామి, ఏడీ, మత్స్యశాఖ, నిజామబాద్‌

విశ్రాంత ఉద్యోగులు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

నిజామాబాద్‌ నాగారం: విశ్రాంత ఉద్యోగులు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్‌లో తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌- రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ జిల్లా కమిటీ నిర్మించిన పెన్షనర్స్‌-సీనియర్‌ సిటీజన్‌ భవనంను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెన్షనర్స్‌, సీనియర్‌ సిటిజన్స్‌ యోగక్షేమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ మాట్లాడుతూ.. రిటైర్డ్‌ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవనానికి ధన్‌పాల్‌ లక్ష్మీబాయి- విఠల్‌గుప్తా చారిటబుల్‌ ట్రస్ట్‌ ద్వారా వంద కుర్చీలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను అసోసియేషన్‌ సభ్యులు సన్మానించారు. అడిషనల్‌ కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, మహిళా–శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ జిల్లా అధికారిణి రసూల్‌బి, అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, మదన్‌ మోహన్‌, ఈవీఎల్‌ నారాయణ, హమీద్‌, శిర్ప హనుమాండ్లు, రాధా కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిశీలన

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంను బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థుల అభిప్రాయాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డి, ముప్ప గంగారెడ్డి, మానాల మోహన్‌ రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమమేధ ద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం

- తెయూ మాస్‌ కమ్యూనికేషన్‌ ప్రొఫెసర్‌, సోషల్‌సైన్స్‌ డీన్‌ ఘంటా చంద్రశేఖర్‌



జూమ్‌ మీటింగ్‌లో పాల్గొన్న ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): కృత్రిమమేధ ద్వారా సమాజంపై అనుకూలత కంటే ప్రతికూల ప్రభావం పడుతోందని తెలంగాణ యూనివర్సిటీ మాస్‌ కమ్యూనికేషన్‌ అధ్యాపకుడు, సోషల్‌సైన్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ అన్నారు. పీస్‌ జర్నలిజం స్టడీస్‌ అంశంపై సౌత్‌కొరియా దేశ రాజధాని సియోల్‌లో హెచ్‌డబ్ల్యూపీఎల్‌ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై జూమ్‌ ద్వారా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమమేధ ద్వారా సృష్టించిన వీడియోలు వైరల్‌ కావడం వల్ల కొన్ని సందర్భాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా తయారయ్యాయన్నారు. వాటి విశ్వసనీయతపై అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. సమాజాన్ని అశాంతికి గురిచేసే అంశాలపై నియంత్రణకు ప్రత్యేక మెకానిజం అవసరమన్నారు. పౌరుల హక్కుల రక్షణకు, వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన విధంగా చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో వివిధ దేశాల నుంచి వందకుపైగా ప్రతినిధులు హాజరయ్యారు.

తెయూలో ఘనంగా హనుమాన్‌ శోభాయాత్ర



హనుమాన్‌ జయంతి వేడుకల్లో పాల్గొన్న రిజిస్ట్రార్‌ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం హనుమాన్‌ జన్మోత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్‌ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అంతకుముందు క్యాంపస్‌ ఆవరణలోని హనుమాన్‌ ఆలయం వద్ద రిజిస్ట్రార్‌ యాదగిరి, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌, కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌కుమార్‌, ప్రొఫెసర్‌ కనకయ్య, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాషాయ జెండాలు చేతబట్టి నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మోహన్‌, అశోక్‌, సభ్యులు అక్షయ్‌, మనోజ్‌, శివ, వినోద్‌, సంతోష్‌, రాకేష్‌, సాయినాథ్‌, శ్రావణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో పోలీసుల తనిఖీలు



బస్టాండ్‌ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో గురువారం నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన డాగ్‌స్క్వాడ్‌ ద్వారా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌తో పాటు హోటల్స్‌, దుకాణాలను సిబ్బంది తనిఖీ చేశారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ మాట్లాడుతూ.. ఎవరైన నిషేధిత మత్తు పదార్థలు వాడితే చర్యలు తప్పన్నారు. పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంప్లాయిస్‌ జేఏసీ చైర్మన్‌గా సుమన్‌

నిజామాబాద్‌ అర్బన్‌: ఎంప్లాయిస్‌ జేఏసీ జిల్లా చైర్మన్‌ సుమన్‌ నియమితులయ్యారు. నగరంలోని టీఎన్జీవోఎస్‌ కార్యాలయంలో గురువారం తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్‌ అధికారుల జాయింట్‌ యాక్షన్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంప్లాయిస్‌ జేఏసీ జిల్లా చైర్మన్‌గా సుమన్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

ఫోన్‌ కొడితే ఆర్టీసీ బస్సుల సమాచారం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఆర్టీసీ రీజియన్‌లోని బస్సు వేళల వివరాల కోసం ప్రయాణికులు ఫోన్‌ కొడితే సమాచారం అందించనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం కోరారు. రీజియన్‌ పరిధిలోని నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌, బాన్సువాడ, కామారెడ్డి డిపోల పరిధిలో సంప్రదించాల్సిన ఫోన్‌ నంబర్లు ఇలా..

ఆర్మూర్‌-73828 43133
బోధన్‌-98495 00725
నిజామాబాద్‌-99592 26022
బాన్సువాడ-94911 05706
కామారెడ్డి-73828 43747

గంజాయి బానిసలకు కౌన్సెలింగ్‌ ఇవ్వాలి



భీమ్‌గల్‌ పోలీస్‌ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

మోర్తాడ్‌: గంజాయి మత్తుకు బానిసైన వారికి కౌన్సెలింగ్‌ ఇవ్వాలని సీపీ సాయిచైతన్య సిబ్బందిని ఆదేశించారు. భీమ్‌గల్‌ పోలీస్‌ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. సీపీ మాట్లాడుతూ.. గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాల నిరోధన కోసం కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్‌ రూరల్‌, భీమ్‌గల్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీధర్‌ రెడ్డి, సత్యనారాయణ, సర్కిల్‌ ఎస్సైలు మహేష్‌, అనిల్‌రెడ్డి, విక్రమ్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకాలతో జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: ఆల్‌ ఇండియా సీనియర్‌ ఇంటర్‌ జోనల్‌ జాతీయ సాఫ్ట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించారు. జమ్ముకాశ్మీర్‌ రాష్ట్రంలో ఈనెల 14నుంచి 16వరకు పోటీలు జరుగగా, జిల్లా క్రీడాకారులు సౌత్‌ జోన్‌ జట్టు తరఫున ఆడి ప్రతిభ చూపారు. ఈసందర్భంగా క్రీడాకారులు వినయ్‌ (మిట్టపల్లి), మహిళల విభాగంలో వైశాలి (అక్లూర్‌), సామ్యరాణి (పందిమడుగు), మౌనిక (కారేపల్లితండా), నేహ శ్రీ (ధర్మారం) తృతీయస్థానంలో నిలిచారు. దీంతో సాఫ్ట్‌బాల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా సెక్రెటరీ జనరల్‌ ప్రవీణ్‌ అనౌకర్‌, జాయింట్‌ సెక్రెటరీ శోభన్‌ బాబు వారికి కాంస్య పతకాలు, ట్రోఫీ అందజేసినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్‌ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిపించాలి



ఆర్మూర్‌టౌన్‌: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగే చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్‌ అన్నారు. ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్స్‌, ఎంపీహెచ్‌ సూపర్‌వైజర్‌లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌ అర్బన్‌: పేద విద్యార్థులకు ఇంటర్‌ విద్య, ఎంసెట్‌ శిక్షణ అందించేందుకు జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి కార్పొరేట్‌ కళాశాలలో ప్రవేశం కల్పించి ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల ప్రైవేట్‌ కళాశాలలు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలోని వసతుల కల్పన, ఫీజుల వివరాలను అందజేయాలని తెలిపారు.

క్రైం కార్నర్‌

ఆర్మూర్‌లో బాలిక ఆత్మహత్య



చిట్యాల నీత (ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని కోటార్మూర్‌లో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోటార్మూర్‌కు చెందిన చిట్యాల మంజుల బుధవారం తన నలుగురు కూతుళ్లతో కలిసి ఇంటి సమీపంలోనే ఉన్న మహాలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో శుభకార్యానికి వెళ్లింది. రాత్రి 10గంటల సమయంలో మూడో కూతురు నీత(17)కు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక అపార్ట్‌మెంట్‌ ఐదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

డ్రైయినేజీలో పడి ఒకరి మృతి

దోమకొండ: మండలకేంద్రంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు డ్రైయినేజీలో పడి మృతిచెందాడు. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన నాగరపు అనిల్‌(31)జులాయిగా తిరగడంతో భార్య అతడిని విడిచివెళ్లింది. దీంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న మధ్యాహ్నం అతడు ఇంటి నుంచి వెళ్లి, తిరిగిరాలేదు. గురువారం గ్రామ శివారులోని పెద్ద మురికికాలువలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

టిప్పర్‌ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం టిప్పర్‌ బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మొరం లోడ్‌తో ఉన్న టిప్పర్‌ గురువారం తాడ్వాయి మండల కేంద్రం నుంచి కామారెడ్డి వైపు బయలుదేరింది. తాడ్వాయి శివారులోని పోచమ్మ ఆలయం సమీపంలోగల మూలమలుపు వద్ద టిప్పర్‌ అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి అతడిని వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్‌ స్పీడ్‌గా నడపడం, అజాగ్రత్త డ్రైవింగ్‌ వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అన్నను చంపిన తమ్ముడికి జీవిత ఖైదు

రుద్రూర్‌: పోతంగల్‌ మండల కేంద్రంలో ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడికి బోధన్‌ కోర్టు జీవితఖైదు విధించింది. ఎస్సై సునీల్‌ తెలిపిన వివరాలు ఇలా.. పాత పోతంగల్‌ గ్రామానికి చెందిన దిమ్మెలవార్‌ గోవింద్‌ (55)ను 2024 ఏప్రిల్‌ 4న అతడి తమ్ముడు విఠల్‌ హత్యచేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి రుద్రూర్‌ సీఐ జయేష్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్‌ చేసి చార్జిషీట్‌ దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో విఠల్‌కు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి రవికుమార్‌ గురువారం తీర్పు వెల్లడించారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం అధికారులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా 12 మంది పట్టుబడ్డారు. వీరందరికీ సిబ్బంది కౌన్సెలింగ్‌ నిర్వహించి, కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ఐదుగురికి జడ్జి రూ.8500 జరిమానా విధించగా, ఏడుగురికి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ తెలిపారు.

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో పట్టుబడ్డ ఒకరికి బోధన్‌ కోర్టు జడ్జి ఒక రోజు జైలు విధించినట్లు ఎస్సై సునీల్‌ గురువారం తెలిపారు. అలాగే రూ. వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు.

వర్ని: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా కారేగాం తండాకు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు బోధన్‌ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు వర్ని ఎస్సై మహేష్‌ తెలిపారు.

నకిలీ న్యాయవాదిపై కేసు నమోదు!

ఖలీల్‌వాడి: నగరంలో నకిలీ సర్టిఫికేట్లతో న్యాయవాదిగా చలామణి అవుతున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని అరుంధతీనగర్‌కు చెందిన దీపక్‌కు, మేడ్చల్‌–మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలంలోని చక్రిపురంకు చెందిన గోడిసే బాలశకుంతల దేవి పెద్దకుతూరు కరుణకుమారితో 2004లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో దీపక్‌ న్యాయవాదిగా పనిచేస్తున్నట్లు వధువు కుటుంబీకులకు తెలిపారు. దీపక్‌ మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు బాలశకుంతల దేవికి ఇటీవల తెలిసింది. దీంతో ఆమె అల్లుడి వివరాలు తెలుసుకునే క్రమంలో అతడి డిగ్రీ సర్టిఫికెట్లు, ఎల్‌ఎల్‌బీ సర్టిఫికెట్లు నకిలీవిగా గుర్తించారు. ఈమేరకు నకిలీ సర్టిఫికెట్లతో న్యాయవాదిగా కొనసాగుతున్న దీపక్‌పై చర్యలు తీసుకువాలని ఆమె ఫిర్యాదు చేయగా ఒకటోటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా కేసు విచారణ జరుగుతుందన్నారు.


తిమ్మాపూర్‌లో చోరీకి యత్నం

- దుండగుడిని పట్టుకున్న గ్రామస్తులు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని తిమ్మాపూర్‌ గ్రామంలోగల ఓ ఇంట్లో ఇద్దరు దుండగులు చోరీకి యత్నించగా, ఓ దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. బిచ్కుందకు చెందిన ఇద్దరు యువకులు కడమంచి రమేష్‌, శ్రీకాంత్‌ గురువారం ఉదయం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి పాత ఇంటిలో ఉంచిన ట్రాక్టర్‌కు సంబంధించిన పాత ఇనుప సామాన్లను చోరీ చేసేందుకు యత్నించారు. వెంటనే ఇంటి యజమాని వారిని గుర్తించి కేకలు వేశారు. గ్రామస్తులు ఇంటి వద్దకు వచ్చి నిందితులను పట్టుకునేందుకు యత్నించగా ఒకరు పారిపోగా రమేష్‌ గ్రామస్తులకు చిక్కాడు. గ్రామస్తులు వివరాలు సేకరించి అతడిని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



మహమ్మద్‌ షబ్బీర్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని బతుకమ్మకుంట కాలనీకి చెందిన మహమ్మద్‌ షబ్బీర్‌ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కాలనీకి చెందిన అతడు కూలీ పనులు చేసుకునేవాడు. కొద్దిరోజులుగా మతిస్థిమితం సక్రమంగా ఉండటం లేదు. గతంలో చాలా సార్లు ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. కానీ ఈనెల 13న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య కమర్‌ బేగం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



సుల్తాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ గోపాల్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం హౌసింగ్ డీఈఈ గోపాల్ పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంతం చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రవిరాథోడ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

దోమకొండ/పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డి : అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం దోమకొండ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని సముందర్ తండాలో తండా వాసులతో ఆయన మాట్లాడారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చర్యలు తీసుకుంటున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా అన్నారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు తదితరులున్నారు.

ధాన్యం దండిగా..

- కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న వడ్లు..
- లక్ష్యానికి మించి సేకరించే అవకాశం



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వరద పోటెత్తుతోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడం, దళారులు, వ్యాపారులు యాసంగి ధాన్యం కొనుగోలుకు అనాసక్తి చూపడటంతో సొసైటీలు, ఐకేపీ కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గత మూడు, నాలుగు సీజన్లలో అధికారులు నిర్దేశించిన లక్ష్యంలో 60 నుంచి 70శాతం మాత్రమే సేకరించారు. కానీ ఈ సీజన్‌లో ప్రభుత్వ లక్ష్యం 8 లక్షల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం సేకరించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

4.20లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లాలో 4.20లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 3.75లక్షల ఎకరాల్లో సన్నరకాలు, 45వేల ఎకరాల్లో ఇతర రకాలను రైతులు సాగుచేశారు. మొత్తం 11.85 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ప్రభుత్వ కేంద్రాల ద్వారా 8లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ 5నుంచి కొనుగోళ్లు ఊపందుకోగా, ఇప్పటివరకు 465 కేంద్రాల ద్వారా 2.93లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. ఇప్పటివరకు 89,521 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.207.69 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.

3లక్షల మెట్రిక్ టన్నులకు చేరువలో..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన 15రోజుల్లోనే 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. గత వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 25వేల మెట్రిక్ టన్నులు సేకరిస్తున్నారు. ఈనేపథ్యంలో హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత, గోదాములు, రైస్‌మిల్లుల్లో నిల్వ సామర్థ్యం, ఇతర అన్ని సమస్యలను అధిగమించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. కాగా బయట మార్కెట్ కంటే మంచి ధర, రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బోనస్ ఇస్తుండటంతో..

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు అధిక విస్తీర్ణంలో సన్నరకాలను సాగుచేశారు. బోనస్ లేక ముందు దొడ్డు రకాలను సాగు చేసేవారు. గతంలో నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్, మహారాష్ట్ర, కర్నాటక, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ధాన్యం కొనుగోలుచేసేవారు. రూ.500 బోనస్ ప్రకటనతో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, తదితర ప్రాంతాల్లోని సొసైటీలు, ఐకేపీ కేంద్రాలు ధాన్యంతో కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసినా ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. సొసైటీలకు ధాన్యం పోటెత్తుతుండటంతో తలకు మించిన భారంగా మారిందని ఆయా సొసైటీల ప్రతినిధులు వాపోతున్నారు.

చివరి గింజ వరకు సేకరిస్తాం..



రైతులు పండించిన చివరిగింజ వరకూ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తాం. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ సజావుగా ముందుకు సాగుతున్నాం. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాం. కొనుగోళ్లపై ప్రతినిత్యం సమీక్షిస్తున్నాం. త్వరలోనే బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయి.

–కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్, నిజామాబాద్

ఓరి దేవుడా.. ఎంత కష్టమొచ్చింది!

- తిండి పెట్టలేక కూతుళ్లను కొట్టిన నిస్సహాయ తల్లి
- అక్కున చేర్చుకున్న మీడియేషన్ ప్రతినిధులు
- బాలసదన్‌కు పిల్లల తరలింపు
- స్వధార్ హోమ్‌లో తల్లికి ఆశ్రయం



బోధన్‌లోని స్వధార్ హోంలో లతను చేర్పిస్తున్న మీడియేషన్ సెంటర్, చైల్డ్ కమిటీ ప్రతినిధులు

బోధన్: ఆకలితో అలమటిస్తున్న కన్నబిడ్డల కడుపు నింపలేక ఓ నిస్సహాయ తల్లి నడిరోడ్డుపై పిల్లలపై చేయిచేసుకున్న ఘటన అందరినీ కలిచివేసింది. ఈ నెల 14న బోధన్ పట్టణంలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన లత (35) ఎనిమిదేళ్ల క్రితం అదే మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కూతుర్లు హరిప్రియ(6), లహరిక(4) జన్మించారు. లతతోపాటు పిల్లలను వదిలేసి భర్త మరో వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో లత స్వగ్రామంలోనే దినసరి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుర్లను పోషించుకుంటూ కాలం వెళ్లదీస్తుండగా, పోతంగల్ మండలం కల్లూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి పరిచయమయ్యాడు. లతతోపాటు పిల్లలను బాగా చూసుకుంటానని నమ్మబలికి మార్చి 1న వారిని వెంట తీసుకెళ్లాడు. బాసర, భైంసా ప్రాంతాల్లో 15 రోజుల పాటు తిప్పి.. బాసర సరస్వతి దేవి ఆలయం వద్ద వదిలేసి వెళ్లాడు. దిక్కుతోచని స్థితిలో లత ఇద్దరు కూతుర్లతో ఆలయం వద్దనే ఆశ్రయం పొందింది. 15 రోజుల క్రితం ఉపాధి కోసం బోధన్‌కు వచ్చి ఓ వాటర్ ప్లాంట్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. కారణం ఏదో కానీ, వాటర్‌ప్లాంట్ నుంచి బయటకు వచ్చింది. నిరాశ్రయురాలై , ఉపాధి కోల్పోయి ఇద్దరు కూతుర్లు ఆకలితో అలమటిస్తుంటే కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి ఎదురుకావడంతో మనోవేదనతో కుమిలిపోయింది. ఈ నెల 14న పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆకలితో అలమటిస్తున్న ఇద్దరు కూతుర్లకు తిండిపెట్టలేక తల్లి కొట్టడంతో పిల్లలిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు గుర్తించి మీడియేషన్ సెంటర్ పారాలీగల్ వాలంటీర్లకు సమాచారం ఇచ్చారు. పారాలీగల్, చైల్డ్ కమిటీ ప్రతినిధులు పద్మాసింగ్, రమణ తల్లీకూతుర్లను వెంట తీసుకెళ్లి స్థానిక స్వధార్ హోమ్‌లో చేర్పించారు. గురువారం బోధన్‌కు వచ్చిన చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులకు హరిప్రియ, లహరికలను అప్పగించగా, వారు నిజామాబాద్‌లోని బాలసదన్‌లో చేర్పించారు. తల్లి లతకు స్వధార్ హోంలోనే ఆశ్రయం కల్పించారు.

మంత్రి పర్యటనలో గలాటాపై ఆరా!

- నిందితులను గుర్తిస్తున్న పోలీసు శాఖ
- చట్టరీత్యా చర్యలకు సిద్ధం
- ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భీమ్‌గల్ పర్యటన సందర్భంగా అల్లరి సృష్టించిన వారిపై పోలీసుశాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. ఉద్దేశపూర్వకంగానే గలాటా చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోలీసులపై ఇసుక చల్లడంతో గత్యంతరం లేక లాఠీచార్జి చేయాల్సి వచ్చినట్లు ఓ అధికారి చెప్పారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల అనుమతి పొందినట్లు తెలుస్తోంది. ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు 30 నుంచి 40 మంది ఉదయం నుంచి వేచి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అందులో కొందరు మద్యం మత్తులో ఉండడంతో ఎంత నచ్చజెప్పినా వినకుండా పోలీసులపైకి దాడికి ప్రయత్నించారని అధికారులు భావిస్తున్నారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో నిందితులను గుర్తించేందుకు పోలీసు సిబ్బంది తీసిన వీడియోలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొందరిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన షబ్బీర్ అలీ

- వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ..



సుప్రీంకోర్టు ముందు న్యాయవాదులతో షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : వక్ఫ్ బోర్డు సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సుప్రీంకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసును ప్రముఖ న్యాయవాదులు సల్మాన్, ఖుర్షీద్ బృందం వాదిస్తున్నట్లు చెప్పారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టిందన్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసిందన్నారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపినట్లు ఆయన చెప్పారు. సుప్రీంకోర్టుపై పూర్తి స్థాయి నమ్మకం ఉందని తప్పకుండా న్యాయం జరుగుతుందని షబ్బీర్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు.

మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

మాచారెడ్డి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. స్టేషన్ రికార్డులు పెండింగులో లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామ పోలీసు అధికారులకు కేటాయించిన గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. పోలీసు అధికారి, సిబ్బంది ఠాణాకు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్ పెట్రోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రూరల్ సీఐ రామన్, సిబ్బంది ఉన్నారు.

ఆపరేషన్ డాగ్.. అభాసుపాలు

- వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియలో..
- మొదట స్వచ్ఛంద సంస్థకు అప్పగింత
- ఆ తర్వాత ఖరీదు ఎక్కువైందని వారికి స్వస్తి
- నిజామాబాద్, నిర్మల్ నుంచి తర్ఫీదు వ్యక్తుల ద్వారా..
- లక్ష్యం ఆలస్యం కావడంతో మళ్లీ తర్జనభర్జన



వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

సాక్షి,ఆదిలాబాద్: ఆపరేషన్ డాగ్.. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్.. జంతు జనన, నియంత్రణ నియమాలను అనుసరించి సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్స చేయడమే దీని అర్థం. ఆదిలాబాద్ పట్టణంలో వీధికుక్కల ద్వారా సంతానోత్పత్తిని నిరోధించేందుకు చేపట్టిన ప్రక్రియ పూర్తిగా అభాసు పాలైంది. మొదట స్వచ్ఛంద సంస్థకు ఈ ప్రక్రియను అప్పగించారు. ఆ తర్వాత ధర అధికంగా ఉందని వారికి స్వస్తి పలికారు. ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లో కుక్కలను పట్టడంలో తర్ఫీదు పొందిన వ్యక్తులను తీసుకొచ్చి తక్కువ ధరకు వారితో వీధికుక్కలను పట్టించారు. ఇక సంతానోత్పత్తి కలగకుండా పశుసంవర్ధక శాఖ అధికారుల ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇలా ధర సగానికంటే తక్కువ వ్యయం అవుతుందని చెప్పుకొచ్చారు. ఇలా చేపట్టడంలో ప్రక్రియ పూర్తిగా ఆలస్యమవుతుందని ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. మళ్లీ స్వచ్ఛంద సంస్థకు ఈ ప్రక్రియ అప్పగిద్దామని ఆలోచిస్తున్నారు.

ఒక్కో కుక్కకు రూ.1600 చొప్పున..

ఆదిలాబాద్ పట్టణంలో వీధి కుక్కలు 5వేలకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా సంతానోత్పత్తి పెరగకుండా వాటికి శస్త్ర చికిత్స నిర్వహించాలని రెండేళ్ల కిందట నిర్ణయించారు. మొదట ఈ ప్రక్రియను స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించాలని తలచి ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థకు టెండర్ అప్పగించారు. అందులో భాగంగా వారు వీధి కుక్కలను పట్టడం, జంతు సంరక్షణ కేంద్రాలకు తరలించడం , శస్త్ర చికిత్స నిర్వహించడం, ఔషధాలు, ఆహారం, పూర్తిగా కోలుకునే వరకు కొన్నిరోజులు సంరక్షించి తిరిగి ఎక్కడినుంచి పట్టుకొచ్చామో అక్కడే వాటిని వదిలేయాలి. ఇది ఆ టెండర్ పొందిన స్వచ్ఛంద సంస్థ చేపట్టాల్సిన ప్రక్రియ. దీనికోసం ఆ సంస్థకు ఒక్కో కుక్కకు రూ.1600 చొప్పున ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆ స్వచ్ఛంద సంస్థ 1300 వీధి కుక్కలను పట్టుకొని ఈ ప్రక్రియను చేపట్టింది. వారితో అక్కడికే ప్రక్రియ నిలిపివేశారు. ఆ తర్వాత శునకాలను పట్టుకోవడంలో తర్ఫీదు పొందిన నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులను నియమించుకున్నారు. వారు కేవలం వీధి కుక్కలను పట్టుకోవడం వరకే పరిమితం. అందుకోసం వారికి ఒక్కో కుక్కకు రూ.500 చొప్పున ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇలా 500 వరకు వీధి కుక్కలను పట్టుకున్నట్లు, స్టెరిలైజేషన్ నిర్వహించినట్లు మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. తద్వారా భారీగా మిగులు చేకూరిందని చెప్పుకొచ్చారు.

విమర్శలు ఇలా..

స్వచ్ఛంద సంస్థ పేరిట, ఆ తర్వాత తర్ఫీదు వ్యక్తుల పేరిట వీధికుక్కలను పట్టుకోవడం వరకు సబబుగా జరిగినప్పటికీ, ఆ తర్వాత వాటిని హతమార్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ సమీపంలో జేసీబీ ద్వారా తవ్వకాలు జరిపి వాటి కళేబరాలను పూడ్చిపెట్టారనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా వీధి కుక్కలను ఎక్కడినుంచి పట్టుకొస్తారో.. ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్కడే వదిలిపెట్టాలి. పలు చోట్ల శునకాలను తిరిగి కాలనీలో వదిలిపెట్టకపోవడంతో పలువురు ఈ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ వ్యవహారంలో ఇటు సంస్థ, అటు బల్దియా అధికారులు లక్షల రూపాయలు స్వాహా చేశారనే అపవాదు వ్యక్తమవుతోంది.

మళ్లీ పునరాలోచన..

పట్టణంలో 5వేలకు పైగా వీధికుక్కలు ఉంటే ఇప్పటివరకు 1800 వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు పూర్తి చేసినట్లు మున్సిపాలిటీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే రెండేళ్లలో లక్ష్యానికి సగం కూడా చేరుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మళ్లీ బల్దియా అధికారులు పునరాలోచనలో పడ్డారు. స్వచ్ఛంద సంస్థకే ఈ ప్రక్రియను అప్పగించి పూర్తి చేయాలని అనుకుంటున్నారు.

తప్పుడు ప్రచారం..



వీధి కుక్కలను ఎక్కడినుంచైతే పట్టుకున్నామో అక్కడే వదిలిపెట్టే వరకు నిబంధనల మేరకు ఏమేం చేయాలో ఆవిధంగానే చేపట్టాం. శస్త్ర చికిత్సల తర్వాత పూర్తి సంరక్షణ తీసుకొని అవి కోలుకున్న తర్వాత తీసుకువచ్చిన చోటే వదిలిపెట్టాం. దీనికి సంబంధించి ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తూ మాపై నిందలు మోపుతున్నారు.

– నరేందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్ మున్సిపాలిటీ

అయితే మున్సిపాలిటీ అధికారులు దీన్ని కొట్టిపడేస్తున్నారు.

‘సిరాల’.. ఎందుకిలా?



సిరాల ప్రాజెక్ట్ కింద ఎండుతున్న వరి పొలం



నీరందక ఎండుతున్న మొక్కజొన్న

- రెండేళ్ల కింద తెగిన ప్రాజెక్ట్ కట్ట
- కొనసా...గుతున్న మరమ్మతు
- వట్టిపోయిన బోర్లు, బావులు
- ప్రశ్నార్థంగా ఆయకట్టు సాగు

భైంసా/భైంసారూరల్: అన్నపూర్ణగా పిలవబడే సిరాల ప్రాజెక్ట్ రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగగా, ఇక్కడి రైతుల పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. 1902లో నైజాం కాలంలో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 2023 వరకు సాగునీరు అందించింది. ప్రాజెక్ట్ తెగడంతోనే ఆయకట్టు రైతులు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్లుగా ప్రాజెక్ట్ మరమ్మతులు చేపడుతున్నా నేటికీ పూర్తి కాలేదు. గతేడాది కొందరు బోర్లు వేసుకోగా ఈసారి అవి వట్టిపోయి సాగు భూములు బీళ్లుగా మారుతున్నాయి. రెండేళ్లలో ఆయకట్టు కింద 130కిపైగా బోర్లు వేసుకోగా ప్రస్తుతం 10 మాత్రమే నీటిని అందిస్తున్నాయి. వరి పొలాలు, మొక్కజొన్న చేన్లు ఎండుతున్నాయి. ఆయకట్టు కింది సిరాల, ఇలేగాం, ఉమ్రి, బోల్సా, బోరిగాం, బెల్‌తరోడ, మాంజ్రి తదితర గ్రామాల్లో బోరుబావులన్నీ వట్టిపోయాయి. 230 ఎకరాల్లో చివరి దశ పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. పొట్టదశలోని వరికి నీటి తడి అందడంలేదు. దీంతో రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. సిరాల ప్రాజెక్టుకు కొద్ది దూరంలోనే బాపూజీ మహరాజ్ భూములు కౌలుకు తీసుకున్న రైతులు ఎప్పటిలాగే వరి సాగు చేశారు. రెండేళ్లుగా ఈ పొలంలోని బోరు నుంచి నీరు బాగానే వచ్చేది. 20 రోజుల్లో బోరు వట్టిపోగా కౌలు రైతులు సాగుచేసిన వరి పొలం ఎండిపోతోంది.

వరి ఎండుతోంది



సిరాల ప్రాజెక్ట్ కింద ఉన్న వరి పొలం ఎండుతోంది. నాటువేసిన నుంచి నీరందించిన బోరు వట్టిపోయింది. కొత్త బోరువేసినా నీళ్లు పడడంలేదు. ఈసారి వరి పంటకు నీరు అందడం కష్టమే. కళ్ల ముందే పొలం బీటలువారింది.

– వీరేశ్, రైతు

పంట నష్టపోతున్నం



సిరాల ప్రాజెక్ట్ తెగిపోగా ఈ ప్రాంత రైతులందరికీ కష్టాలు మొదలైనయ్. ప్రస్తుతం పంటలన్నీ ఎండుతున్నయ్. రెండేళ్లుగా ఇవే కష్టాలు ఎదుర్కొంటున్నం. భూగర్భజలాలు తగ్గినయ్. పొట్టదశలోని వరికి నీటి తడి ఇవ్వలేకపోతున్నం.

– పోషేశ్, రైతు

ఆదివాసీలను అసెంబ్లీకి పంపడమే లక్ష్యం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్, విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలను అసెంబ్లీకి పంపించడంతో పాటు వారికి భూ పంపిణీ చేయించడమే ‘మా భూమి పాదయాత్ర’ లక్ష్యమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీకి చేరుకున్న పాదయాత్రకు ఆదివాసీ గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికి ఆదివాసీలకు ఎంతో సంబంధం ఉందని, ప్రకృతిని కాపాడుతూ భూమిని రక్షిస్తున్న ఆదివాసీలకు గుంట భూమి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా అధ్యక్షురాలు గోడం రేణుకా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిర, డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, బహుజన ఉద్యమ నాయకుడు గద్దల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



మహేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఉరివేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన గురువారం ఖానాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ సీహెచ్.అజయ్, ఇంచార్జీ ఎస్సై శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బాలేకర్ మహేశ్(35) స్థానిక లారీ అడ్డాలో మటన్ దుకాణాన్ని నిర్వహిస్తుంటాడని తెలిపారు. ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఆమె వివాహేతర సంబంధం వద్దనడంతో మనస్తాపం చెందాడని తెలిపారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకున్నాడని తెలిపారు. మృతుడి తండ్రి గంగేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జైలర్ నిర్లక్ష్యంతో రిమాండ్ ఖైదీ మృతి!

- కుటుంబీకుల ఆరోపణ
- గ్రామస్తులతో కలిసి పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయింపు
- న్యాయం చేయాలని డిమాండ్



సిందే సాయినాథ్ (ఫైల్)



పోలీసుస్టేషన్ ఎదుట గ్రామస్తులు, కుటుంబీకులు

ముధోల్: ఆదిలాబాద్ జైలు లో రిమాండ్ ఖైదీగా ఉన్న ముధోల్ మండల కేంద్రానికి చెందిన సిందే సాయినాథ్(32) మృతిచెందాడు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గురువారం ముధోల్ పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. దీనికి జైలర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గత ఫిబ్రవరిలో ఒక కేసు విషయంలో సిందే సాయినాథ్‌తోపాటు ముగ్గురిని ఆది లాబాద్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలు కు వెళ్లి చూడడానికి జైలర్ అనుమతి ఇవ్వలేదు. నాలుగు సార్లు బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదని, మృతిచెందిన తర్వాత బెయిల్ మంజూరు చేశారు. సాయినాథ్ ఆరోగ్యం బాగాలేదని రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జైలు నుంచి సమాచారం రాగానే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వెళ్లాం. అప్పుడు సిందే సాయినాథ్ కాళ్లను గొలుసులతో కట్టేసి ఉంచారు. పూర్తి స్పృహలో లేకుండా దీనావస్థలో ఉన్నాడు. జైలుకు వెళ్లే ముందు పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి జైలుకు ఆరోగ్యంగా వెళ్లిన వ్యక్తి చనిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జైలర్, సిబ్బంది నిర్లక్ష్య కారణంగా సాయినాథ్ మృతిచెందారని కుటుంబీకులు ఆరోపించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, బైఠాయించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో సీఐ మల్లేశ్, ఎస్సై సంజీవ్ మాట్లాడారు. జైలులో రిమాండ్ ఖైదీ మృతి చెందడంపై చట్టపరంగా విచారణ చేయిస్తామనడంతో వారు ఆందోళనను విరమించారు.